క్లుప్తంగా

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కొరిటిపాడు: గుంటూరు నగరంపాలెంలో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం వద్ద బ్యాంకు యూనియన్ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిబ్బంది నియామకం, తాత్కాలిక ఉద్యోగుల నియామకం చేపట్టాలన్నారు. ప్రజల దాడుల నుంచి బ్యాంకు ఉద్యోగుల రక్షణ కల్పించాలన్నారు. గ్రాట్యుటీ చట్ట సవరణ చేసి, పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలన్నారు. సిబ్బంది సంక్షేమ ప్రయోజనాలపై ఆదాయ పన్ను మినహాయింపు కల్పించాలని కోరారు. ఐబీఏ పెండింగ్ సమస్యల పరిష్కరించాలన్నారు. మార్చి 3న ఢిల్లీలో పార్లమెంట్ ముందు ధర్నా నిర్వహించి, ఆర్థిక మంత్రి, డీఎఫ్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మార్చి 24, 25న దేశవ్యాప్తంగా రెండు రోజుల బ్యాంక్ సమ్మె నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ గుంటూరు సర్కిల్ ప్రాంతీయ కార్యదర్శి కె.ఆర్.జయ కుమార్, డెప్యూటీ జనరల్ సెక్రటరీ కె.కోటి రెడ్డి, పి.కిషోర్ కుమార్, రవి చంద్ర రెడ్డి, సయ్యద్ మొహమ్మద్ బాషా, ఎం.సాంబశివరావు, ఎం.రాంబాబు, పి. కళ్యాణ్ పాల్గొన్నారు.

24న కుంభమేళాకు ప్రత్యేక బస్సు

పట్నంబజారు: కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం స్పెషల్ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం ఎం. రవికాంత్ తెలిపారు. మొత్తం 8 రోజుల ప్రయాణం ఉంటుందని చెప్పారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు బస్సు బయలుదేరి ప్రయాగ్‌రాజ్ చేరుకుంటుందని చెప్పారు. అక్కడ నుంచి అయోధ్య, వారణాసి వెళ్లి రావటం జరుగుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకోదలచిన వారు 91927 సర్వీస్ నంబర్ ద్వారా టికెట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. టికెట్ ధర రూ.8,300 నిర్ణయించినట్లు వెల్లడించారు. భోజనాలు, వసతి ఖర్చుల బాధ్యత ప్రయాణికులదేనని చెప్పారు. వివరాలకు 7382897459, 7382896403లో సంప్రదించాలని కోరారు.

నేడు సిమ్స్ మై స్కూల్ వార్షికోత్సవం

గుంటూరు మెడికల్: సిమ్స్ మై స్కూల్ 13వ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ మెయిన్ బ్రాంచి ప్రిన్సిపాల్ రంగాచారి తెలిపారు. శుక్రవారం స్కూల్ మెయిన్ క్యాంపస్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. గోల్డెన్ టుబాకో మైదానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రిన్సిపాల్స్ శారద, సాగర్, మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు.

మాతృ భాషాభివృద్ధితోనే మానవ మనుగడ

గుంటూరు ఎడ్యుకేషన్: మాతృ భాషాభివృద్ధితోనే మానవ మనుగడ సుసాధ్యమని అధికార భాషా సంఘ సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల తెలుగు విభాగ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ సభ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులిపాటి మల్లికార్జున ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమ్మ ఒడి నుంచి నేర్చుకుని అలవాటుగా మాట్లాడుతున్న భాషను చక్కగా నేర్చుకుంటే, ఇతర ఏ భాషల్లోనైనా పరిజ్ఞానం సంపాదించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జున రావు, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ అందె బాలశౌరి, అధ్యాపకులు ఇ. సుదేర్శన్, ఆలూరి నటరాజ కుమారి, తపతీ కిరణ్ పాల్గొన్నారు.

నిరుద్యోగులను దగా చేసిన కూటమి ప్రభుత్వం

లక్ష్మీపురం: నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపడుతూ యువజన విద్యార్థి సంఘాలను పిలిపించుకొని మొదటి సంతకం డీఎస్సీ మీదనే పెడుతున్నానని చెప్పడం జరిగిందని, నూతన ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మెగా డీఎస్సీ కాదు కదా మినీ డీఎస్సీ కూడా ఇవ్వలేదని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ ఖాజావలి విమర్శించారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి లోకేష్ రెడ్ బుక్ అమలు చేయడమే కాదని, నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా కల్పించాలని కోరారు. అలాగే అమరావతిని ఫ్రీ జోన్ గా చేసి 26 జిల్లాల్లో ఉన్నటు వంటి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. రేపు జరిగే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో నిరుద్యోగులకు పదివేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇచ్చేలా బడ్జెట్ కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, నగర కార్యదర్శి చల్లా మరియ దాసు, నగర అధ్యక్షులు సాయి, రెహ్మాన్ పాల్గొన్నారు.

రెడ్ ట్యాంక్ స్థలాల కేటాయింపుపై జగడం

- హలీం పాయింట్ల నిర్వహణకు సిఫార్సు చేసిన ఎమ్మెల్యే
- ఏడుగురు దరఖాస్తు చేసుకుంటే 4గురికి మాత్రమే స్థలాలు కేటాయింపు
- కమిషనర్ చాంబర్ వద్ద గొడవకు దిగిన టెండర్ దారులు

నెహ్రూనగర్: రెడ్ ట్యాంక్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద స్థలాల కేటాయింపులో వివాదం నెలకొంది. వివరాలు.. నగరపాలక సంస్థకు చెందిన రెడ్ ట్యాంక్ షాపింగ్ కాంప్లెక్స్‌లో(తూర్పు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కన) సుమారు వెయ్యి గజాల ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో గత కొద్ది సంవత్సరాలుగా రంజాన్ మాసాన్ని పురస్కారించుకుని హలీం పాయింట్లు నిర్వహించుకుంటున్నారు. అయితే ప్రస్తుతం సదరు స్థలం కేటాయింపులో ఎటువంటి వేలం నిర్వహించకుండానే ఎమ్మెల్యే చెప్పిన వారికి స్థలాలు కేటాయించడంతో వివాదం మొదలైంది. రెండు రోజులుగా సదరు స్థలాల వద్ద అనధికారికంగా హలీం పాయింట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. సదరు స్థలంలో అనధికారికంగా హలీం పాయింట్లు ఏర్పాటు చేయడంపై 20వ తేదీన సాక్షిలో 'ఎమ్మెల్యే పేరుతో మున్సిపల్ స్థలం కబ్జా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో సదరు స్థలాలను నెల రోజులపాటు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రెగ్యులరైజ్ చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.


ఎమ్మెల్యే పేరుతో మున్సిపల్ స్థలం కబ్జా

20న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం

ఎన్నికల కోడ్ ఉండగా..

గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రస్తుతం అమలులో ఉంది. ఈ సమయంలో ఎటువంటి ఆక్షన్ నిర్వహించకూడదు. కాని రంజాన్ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో హలీం పాయింట్ల నిర్వహణకు ఎమ్మెల్యే అనుచరులు పాకులాడుతున్నారు. అందుకు విరుద్ధంగా రూల్స్ బ్రేక్ చేసి ఎమ్మెల్యేకు అనుకూలంగా హలీం పాయింట్ల ఏర్పాట్లుకు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. కమిషనర్ చాంబర్ వద్ద గొడవకు దిగిన వైనం హలీం పాయింట్ల నిర్వహణకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కొంత మందికి లెటర్లు ఇచ్చారు. దాదాపు ఏడుగురు స్థలాలు కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఏడుగురిలో నలుగురికి మాత్రమే స్థలాలు కేటాయించారు. దీంతో మిగిలిన వారు నగరపాలక సంస్థ కార్యాలయం కమిషనర్ చాంబర్ వద్ద గొడవకు దిగారు. తూర్పు ఎమ్మెల్యే లెటర్ ఇచ్చినప్పటికీ మాకు ఎందుకు స్థలం కేటాయించలేదంటూ వాగ్వాదానికి దిగారు. ఇస్తే అందరికి సమానంగా స్థలం కేటాయించాలని లేని పక్షంలో ఆక్షన్ నిర్వహించి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

అడ్వాన్స్ కింద రూ.52,135 తీసుకున్న అధికారులు

నెల రోజుల పాటు రెడ్ ట్యాంక్ స్థలంలో 4 హలీం పాయింట్ల నిర్వహణకు ఎటువంటి ఆక్షన్ లేకుండానే ఎమ్మెల్యే చెప్పారంటూ అధికారులు సదరు స్థలాలను కొంత మందికి కేటాయించారు. అయితే అడ్వాన్స్‌లు కింద హలీం పాయింట్ నిర్వహణకు రూ.52,135 వసూలు చేశారు. మేము కూడా అడ్వాన్స్‌లు ఇస్తాం మాకు కూడా స్థలం కేటాయిస్తే మేము కూడా హలీం పాయింట్లు పెట్టుకుంటామని మిగిలిన వారు అధికారులను నిలదీస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

తెలుగుభాష గొప్పతనాన్ని గుర్తించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగుభాష గొప్పతనాన్ని గుర్తించాలని ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు విభాగ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంబశివరావు మాట్లాడుతూ తెలుగువారిగా జన్మించడం మన అదృష్టమని, తెలుగుభాష ఘనతను చాటిన కరుణశ్రీ, కొసరాజు, శ్రీశ్రీ, కాళోజీ తదితర కవుల పద్యాలను, వారు చేసిన కృషిని వివరించారు. ఈసందర్భంగా ఆయన సొంతంగా రచించి, నిర్మించిన కవిరాజ విజయం టెలీఫిల్మ్‌ను ప్రదర్శించారు. కళాశాల తెలుగుశాఖాధిపతి డాక్టర్ ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ మాతృభాషలో విద్యనభ్యశించినవారిలోనే సృజనాత్మకత ఎక్కువ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదనరావు, అధ్యాపకులు డాక్టర్ వి.భవానీ, డాక్టర్ డి.ధాత్రికుమారి, డాక్టర్ డి.దివిజాకుమారి, డాక్టర్ సి.విజయలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రావెల సాంబశివరావు

కార్పొరేట్‌కు ధీటుగా ఉత్తమ ఫలితాల సాధన

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కార్పొరేట్‌కు ధీటుగా ఉత్తమ ఫలితాలను సాధిస్తోందని ఇంటర్మీడియెట్ విద్య ఆర్ఐఓ జీకే జుబేర్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 28వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆర్ఐఓ జుబేర్ మాట్లాడుతూ విద్యార్థినుల ప్రవేశాలతో పాటు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించడంలోనూ అగ్రస్థాయిలో నిలిచిన జూనియర్ కళాశాల పేద, మధ్య తరగతి విద్యార్థినులకు ఆసరాగా నిలిచిందని చెప్పారు. డీవీఈఓ జె.పద్మ మాట్లాడుతూ సంకల్ప్ 225 ద్వారా విద్యార్థినులకు అందిస్తున్న క్వశ్చన్ బ్యాంక్, విద్యాశక్తి ద్వారా చెన్నై ఐఐటీ నుంచి భౌతిక, గణితశాస్త్రాలతో పాటు ఆంగ్లంలో శిక్షణ వంటి అంశాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతేడాది 30 మందికి పైగా ఆర్ట్స్, సైన్స్ విద్యార్థినులు 90 శాతానికి పైగా మార్కులను సాధించారని, ప్రస్తుతం ఆ సంఖ్య మరింతగా పెరగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.సునీత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్ఐఓ జుబేర్, వేదికపై డీవీఈఓ పద్మ, ప్రిన్సిపాల్ సునీత

వృద్ధుకు వైద్య పరీక్షలు

నెహ్రూనగర్: వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు ఎక్కువగా వస్తుంటాయని వాటిని అశ్రద్ధ చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడటం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని డీపీఓ(జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్) రోహిణి, ఎన్‌సీడీ జిల్లా కన్సల్‌టెంట్ డాక్టర్ గిరిధర్‌లు పేర్కొన్నారు. అటల్ వయో అభ్యుదయ యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నెహ్రూనగర్ చివర ఉన్న వెంకటాద్రిపేటలోని వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వారు మాట్లాడుతూ అటల్ వయో అభ్యుదయ యోజన కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు ముందస్తుగానే ఆరోగ్య సిబ్బంది రక్త పరీక్షలు, ఈసీజీ, ఇతర పరీక్షలు చేసి ఉంచడం జరిగిందని, వైద్య పరీక్షలు చేసుకున్న వారిని పరీక్షించి మందులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు శ్వేత, నివేదిత, సుప్రియ, స్వప్న, విజయలక్ష్మి, ఆశీర్వాదం, ఏఎన్ఎం శివ పార్వతి, ఆశ వర్కర్ వాణి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


వెంకటాద్రిపేటలోని ఆశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

రచనలో సృజనాత్మకత, పదజాలం ఎంతో ముఖ్యం

ప్రముఖ కవయిత్రి మల్లీశ్వరి

గుంటూరు ఎడ్యుకేషన్: కవితా రచనలో సృజనాత్మకత, అర్థవంతమైన పదజాలం ఎంతో అవసరమని ప్రముఖ కవయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి అన్నారు. ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా భారతీయ భాషా విభాగం, ఆంగ్ల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గజల్‌పై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థిని మల్లీశ్వరి మాట్లాడుతూ మాతృభాషా సాహిత్యానికి ఎనలేని సేవలందించారని తెలిపారు. సృజనాత్మకతతో పాటు పదజాలాన్ని నేర్చుకోవడం, వాడటం ఎంతో ముఖ్యమని అన్నారు. కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ పల్లె నుంచి ప్రపంచ రికార్డుల వరకు సాధించిన మల్లీశ్వరి తమ కళాశాల పూర్వ విద్యార్థిని కావడం అభినందనీయమని అన్నారు. ఆమె అలుపెరగని అక్షర యజ్ఞం చేశారని చేస్తున్నారని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడుతూ మల్లీశ్వరి చేసిన సాహిత్య ప్రక్రియలతో పాటు భాషపై, వ్యక్తిత్వ వికాసం కోసం చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సాంబశివరావు, డాక్టర్ వై.ప్రశాంతి, ఆంగ్ల శాఖాధిపతి పి.నాగ సుశీల పాల్గొన్నారు.


మల్లీశ్వరిని సత్కరిస్తున్న నాగసుశీల, గోపీచంద్

కథల పుస్తకాలు చదవాలి



నగరంపాలెం: చిన్నారులు కథల పుస్తకాలు చదవాలని, వారిలో కథలు రాసే ఆసక్తి పెరగాలని గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా బ్రాడీపేటలోని ది సెంట్రల్ స్కూల్‌లో లేఖా సాహిత్యంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. రచయిత్రి తాటికోల పద్మావతి మాట్లాడుతూ తెలుగు తప్పని సరిగా చదవడం, రాయడం నేర్చుకోవాలని అన్నారు. అనంతరం లేఖా సాహిత్యం పోటీల్లో గెలు పొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ రామచంద్ర, ప్రిన్సిపాల్ జ్ఞానశ్రీ, తెలుగు మాష్టారు వెంకటేశ్వరరావు, సంఘం ఉపాధ్యక్షులు బొమ్ము ఉమా మహేశ్వరరెడ్డి, కోశాధికారి నానా, కవిశ్రీ వశిష్ట సోమేపల్లి పాల్గొన్నారు.

27న సాధారణ సెలవు

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 27న ప్రభుత్వ ఉద్యోగులకు సాధారణ సెలవు ప్రకటించినట్లు సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ షేక్ ఖాజావలి శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు ప్రకటించినట్లు వివరించారు. ఎన్నికల రోజు పని చేసే అన్ని ప్రైవేట్, వ్యాపార మేనేజ్‌మెంట్, అథారిటీస్, ట్రేడింగ్స్, ఇండస్ట్రియల్ అండర్ టేకింగ్స్, ఇతర సంస్థలు, వారి కార్యాలయాలలో పని చేసే ఉద్యోగస్తులు ఎవరైనను ఈ ఎన్నికలకు రిజిస్టర్ ఓటర్లు అయినట్లు అయితే వారికి వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుమతి, ఆలస్యపు అనుమతిని, షిఫ్ట్‌ల సర్దుబాటు విధులకు గైర్హాజరు అయ్యేందుకు అనుమతించాల్సిందిగా సూచించారు.

మాతృదేశ సేవలో యువతకు పుష్కలమైన అవకాశాలు



గుంటూరు ఎడ్యుకేషన్: మాతృదేశ సేవలో యువతకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ముందుకు వెళ్లాలని చెన్నైలోని ఆర్మీ జోనల్ రిక్రూటింగ్ అధికారి బ్రిగేడియర్ ఆర్‌కే అవస్తి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ విభాగ ఆధ్వర్యంలో 'భారత ఆర్మీలో ఉద్యోగావకాశాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడారు. సదస్సులో కళాశాల డిగ్రీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితా దేవి, ఆర్మీ రిక్రూటింగ్ అధికారి కల్నల్ పుణీత్ కుమార్ పాల్గొన్నారు.

• తుది దశకు మూడు వంతెనల పనులు





గుంటూరు నగరంలో రైల్వే శాఖ చేపట్టిన మూడు వంతెనల పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెల 25వ తేదీన ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గత ఏడాది నవంబర్ 26న వంతెనల నిర్మాణ పనులు చేపట్టారు. మూడు నెలల్లోనే పనులు పూర్తి చేస్తామని తొలుత ప్రకటించినా వాటర్ పైప్‌లైన్‌లు అడ్డురావడంతో జాప్యం జరిగింది. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

జగనన్నపై అక్కసు వెళ్లగక్కుతున్నారు

- కూటమి నేతలు రైతుల సమస్యలు పట్టించుకున్నారా..?
- ఈద్గా స్థలంలో ఈవెంట్స్ నిర్వహిస్తారా..?
- ఎమ్మెల్యే నసీర్ ఆపకుంటే.. మేము ఆపుతాం
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా


ఈవెంట్స్ ఏర్పాటుపై ఫొటోలు ప్రదర్శిస్తున్న నూరిఫాతిమా, వైఎస్సార్ సీపీ నేతలు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మిర్చి రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వస్తే.. టీడీపీ నేతలు పిచ్చి ప్రేలాపనలు సిగ్గుచేటని ఆ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ధ్వజమెత్తారు. మంగళదాస్‌నగర్‌లోని ఆమె కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేవలం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే టీడీపీ నేతలు అక్కసు వెళ్ళగక్కుతున్నారని ఆరోపించారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్, జగనన్నపై విమర్శలు చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కనీసం ఎప్పుడైనా రైతుల దగ్గరకు వెళితే.. వారి సమస్యలు తెలుస్తాయన్నారు. కనీసం జగన్‌కు భద్రత కూడా కల్పించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆరోపించారు.

ఈద్గా స్థలంలో ఈవెంట్సా...?

అంజుమన్ సంస్థలకు సంబంధించి ఏనాడూ లేని విధంగా సొంత లాభాల కోసం ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ వినియోగించుకుంటున్నారని నూరిఫాతిమా ఆరోపించారు. ఈద్గా ప్రాంతంలో ఇష్టానుసారంగా వ్యాపారాలకు ఇచ్చేశారని మండిపడ్డారు. నమాజ్‌లు చేసుకునే ఎలా చేసుకోవాలని చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రా ముస్లిం కళాశాలలో కల్చరల్ ఈవెంట్ నిర్వహించటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గత 40 సంవత్సరాల్లో ఏనాడూ ఇటువంటి కల్చరల్ ఈవెంట్స్ నిర్వహించి లేదని, గుంటూరులో ఎక్కడా స్థలం లేని విధంగా ఈద్గా స్థలంలోనే నిర్వహించటం సబబుకాదన్నారు. దీనిని కచ్చితంగా మార్పు చేయాలని లేని పక్షంలో తమ యాక్షన్ చూపించాల్సి వస్తుందని హెచ్చరించారు. ముస్లిం మైనారిటీల పక్షానే ఉంటానని, లేకపోతే రాజీమానా చేస్తానని చెప్పిన నసీర్‌అహ్మద్ ఇప్పుడు ప్రవర్తిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయని ఎద్దేవా చేశారు. మౌజాన్, ఇమామ్‌లకు రూ.45 కోట్లు ప్రభుత్వం ఇస్తోందని చెబుతున్నారని, అయితే గతంలో ఉన్న బకాయిలు మాత్రమే చెల్లిస్తున్నారని వివరించారు. వైఎస్ జగనన్న డీబీటీ, నాన్ డీబీటీ పద్ధతిలో రూ.23 వేల కోట్లు లబ్ధి చేకూర్చారని గుర్తు చేశారు. ముస్లిం కళాశాలలో సిమ్స్ కళాశాల నిర్వహించ తలపెట్టి కల్చల ర్ ఈవెంట్ నిలుపుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోకుంటే ప్రతిఘటన తప్పదని స్పష్టం చేశారు. అనంతరం ఆంధ్రా ముస్లిం కళాశాలలో ఏర్పాటు చేస్తున్న ఈవెంట్స్ సంబంధించిన ఏర్పాటు ఫొటోలను ప్రదర్శించారు.

కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, కార్మికులు ఉద్యోగులు తమ సమస్యలపై నేరుగా తమకు అర్జీలు, ఫిర్యాదులు అందించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్మికులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం వర్కర్స్ గ్రీవెన్స్‌ని కమిషనర్ ఛాంబర్‌లో నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ విభాగాల వారీగా కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా వర్కర్స్ గ్రీవెన్స్ నిర్వహిస్తామని, గ్రీవెన్స్‌లో అందే అర్జీలను, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని విభాగాధిపతులకు స్పష్టం చేశారు. కార్మికులు తమకు అందే జీతాలు, ఇతర అలవెన్స్ సమస్యలపై గ్రీవెన్స్‌లో నేరుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, విభాగ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ అండగా ఉంటుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్ సోర్సింగ్ కార్మికులు బండి భవానీ కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్కును, ఈ నెల 18న ప్రమాదంలో మరణించిన జీ కొండమ్మ కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల చెక్కులను శుక్రవారం కమిషనర్ అందజేశారు. సదరు కార్మికుల కుటుంబాలకు నగర పాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పీఎఫ్ కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరింటెండెంట్లను కమిషనర్ ఆదేశించారు.

మార్చి ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో మార్చి ఒకటో తేదీ నుంచి సింగిల్ యూజ్ ప్లాసిక్ వినియోగం, విక్రయంపై సంపూర్ణ నిషేధం అమలు చేయనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాస్టిక్ ఇయర్ బడ్స్, ప్లాస్టిక్ స్టిక్స్ ఉన్న బెలూన్లు, ప్లాస్టిక్ జెండాలు, క్యాండీ స్టిక్స్, ఐస్ క్రీమ్ స్టిక్స్, అలంకరణ కోసం వినియోగించే థర్మాకోల్, ప్లాస్టిక్ ప్లేట్స్, కప్స్, గ్లాసులు, ఫోర్క్, స్పూన్లు, కత్తులు, స్ట్రాలు, ట్రేలు, స్వీట్ బాక్స్‌ల్లో ప్యాకింగ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ ఇనివ్టేషన్ కార్డ్‌లు, సిగరెట్ ప్యాకెట్స్, 100 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ఫ్లెక్సీ బ్యానర్లు వినియోగం, విక్రయం నిషేధం అమలులో ఉంటుందన్నారు. నిషేధ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.10,99,245 లక్షల అద్దె బకాయిలు చెల్లింపు

గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన షాపుల అద్దెలు మార్చి నాటికి నూరు శాతం చెల్లించాలని, బకాయిలు ఉన్న షాపులను సీజ్ చేయడానికి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం లీలా మహల్ ఎదురుగా ఉన్న నగర పాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపుల లీజు దారులు 2024-25 ఏడాదికి సంబంధించిన అద్దె మొత్తాన్ని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆర్వో షాదిక్ బాషా, ఆర్ఐ కాశియ్య పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలి

నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా ప్రజారోగ్య కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని, రోడ్ల మీద, కాలువల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి అపరాధ రుసుం విధించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ తమ రోజు వారీ పర్యటనలో భాగంగా సాయి నగర్, అంకిరెడ్డిపాలెం, ఏటి అగ్రహారం, శ్రీరాం నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికుల రేషనలైజేషన్ పూర్తి అయిన నేపథ్యంలో వార్డు సచివాలయాల వారీగా పారిశుద్ధ్య పనులను డ్రైవ్ మోడ్‌లో చేపట్టాలన్నారు. అంకిరెడ్డిపాలెంలో ప్రజలతో స్థానిక సమస్యలపై మాట్లాడి, ఆయా సమస్యల పరిష్కారానికి విభాగాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఏటీ అగ్రహారం రిజర్వాయర్ పంప్ హౌస్‌ని పరిశీలించి, రానున్న వేసవి దృష్ట్యా అన్ని మోటార్లు వర్కింగ్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రిజర్వాయర్ పరిధిలో పైపులైన్ లీకుల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటనలో డీఈఈలు శ్రీనివాస్, మధుసూదన్ పాల్గొన్నారు.


కమిషనర్‌కు అద్దె బకాయిలకు సంబంధించిన చెక్కులను అందజేస్తున్న షాపు లీజుదారులు

సెల్లార్‌లను పార్కింగ్ కోసమే వినియోగించాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని హాస్పిటల్స్, కమర్షియల్ భవనాలు సెల్లార్లలను పార్కింగ్ కోసమే వినియోగించాలని, ఇతర అవసరాలను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో సెల్లార్ల వినియోగం, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు, ట్రాఫిక్ అధికారులు, ఐఎంఏ ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, తూర్పు ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ సుబ్బారాయుడు, డాక్టర్ సాయి కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి

గుంటూరు నగరంలో వార్డు సచివాలయాల వారీగా ప్రభుత్వ ప్రాధాన్య సర్వేలను సకాలంలో పూర్తి అయ్యేలా నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం సర్వేల వేగవంతంపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.

•న్యాయవాదుల ధర్నా

గుంటూరు లీగల్: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన న్యాయవాదుల అమెండ్మెంట్ బిల్లు- 2025 న్యాయవాదుల హక్కులను హరించేలా ఉన్నాయని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ బిల్లును ఉద్దేశించి న్యాయవాదులకు అన్యాయం జరుగుతుందని అన్నారు.